# పలు కేసులు నమోదైనా ఆగని రేషన్ మాఫియా!


నేటి దిక్సూచి
తెలుగు దినపత్రిక
RNI No. TGTEL/25/A3190


### కేసులు నమోదైనా.. రేషన్ దందా ఆగేదెప్పుడు ....మూడు నెలల రేషన్ ఒకేసారి..

### అక్రమార్కుల కన్ను ....పెద్దగోల్కొండలో యథేచ్ఛగా రేషన్ బియ్యం వ్యాపారం...

రంగారెడ్డి ప్రతినిధి/ నేటి దిక్సూచి : పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం అందిస్తున్న పీడీఎస్ రేషన్ బియ్యంపై అక్రమార్కుల కన్ను పడింది. రంగారెడ్డి జిల్లా పెద్ద గోల్కొండ పరిసర ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని రేషన్ బియ్యం అక్రమ సేకరణ, నిల్వ, రవాణా దందా కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు పోలీసులు, సివిల్ సప్లైస్ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినప్పటికీ.. దందా మాత్రం ఆగకపోవడంపై స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**మూడు నెలల బియ్యం.. మాఫియాకు పండుగేనా?**

ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటం అక్రమార్కులకు కలిసొచ్చిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కసారిగా ఎక్కువ మొత్తంలో బియ్యం లబ్ధిదారుల చేతికి రావడంతో వారి ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని కొందరు మధ్యవర్తులు తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా గ్రామాల నుంచి సేకరించిన బియ్యాన్ని ఒకచోట చేర్చి భారీ మొత్తంలో తరలిస్తున్నట్లు సమాచారం.

**పగలు సేకరణ.. రాత్రికి రహస్య రవాణా**

గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో చిన్న వాహనాల ద్వారా బియ్యాన్ని సేకరించి.. రాత్రివేళల్లో రహస్యంగా గోదాములు, నిల్వ కేంద్రాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడ పెద్ద మొత్తంలో బియ్యం నిల్వ చేసిన అనంతరం లారీలు, ఇతర భారీ వాహనాల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల బాలాపూర్ వద్ద కర్ణాటకకు తరలిస్తున్న 24 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడటం ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై అనేక అనుమానాలకు తావిస్తోంది.

**కేసులు నమోదైనా.. దందా మాత్రం యథేచ్ఛ!**

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై గతంలో కూడా అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ, కొందరు అక్రమార్కులు మళ్లీ అదే దందాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేసులు నమోదైన తర్వాత కూడా అక్రమ రవాణా కొనసాగుతుండటంతో.. చర్యలు కేవలం వాహనాలు, బియ్యం పట్టుకోవడంతోనే ముగుస్తున్నాయా? అసలు సూత్రధారుల వరకు దర్యాప్తు ఎందుకు వెళ్లడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. పట్టుబడిన ప్రతిసారీ వాహనాలు, బియ్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయడం మాత్రమే కాకుండా.. ఈ దందా వెనుక ఉన్న కొనుగోలుదారులు, నిల్వ కేంద్రాల నిర్వాహకులు, రవాణాదారులు, అసలు సూత్రధారులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పెద్ద గోల్కొండ, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రాత్రివేళల్లో



రంగారెడ్డి జిల్లాలో అక్రమ రేషన్ దందా.. ప్రభుత్వ పథకాలపై అవినీతి నీడ.

వాహనాల రాకపోకలపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

**పేదల బియ్యానికి శాశ్వత రక్షణ కల్పించాలి**

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలంటే సివిల్ సప్లైస్, పోలీస్ శాఖలు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అనుమానాస్పద గోదాములు, నిల్వ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి, పదేపదే అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు ఇప్పటికైనా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు



# అర తులం బంగారం కోసం కిరాతకం

### వృద్ధురాలిని హత్య చేసి గోనె సంచిలో కుక్కి నీటి సంపులో పడేసిన దుండగుడు

మీర్‌పేట/నేటి దిక్సూచి : అర తులం బంగారు కమ్మలు, రూ.10 వేల నగదు కోసం ఓ వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన ఘటన మీర్‌పేటలో తీవ్ర కలకలం రేపింది. అటుగా వెళ్తున్న వృద్ధురాలిని తన చిప్స్ షాప్‌లోకి పిలిచి హత్య చేసిన నిందితుడు.. మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి నీటి సంపులో పడేసినట్లు పోలీసులు వెల్లడించారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

**ముగ్గురు మనవరాళ్లకు ఆధారంగా..**

మృతురాలు కమలమ్మ స్కూల్లో ఆయాగా పనిచేస్తూ ముగ్గురు మనవరాళ్లను సాకుతున్నట్లు తెలిసింది. రోజువారీ పనుల్లో భాగంగా అటుగా వెళ్తున్న ఆమెను చిప్స్ షాప్ నిర్వాహకుడు ప్రకాష్ తన షాప్‌లోకి పిలిచినట్లు పోలీసులు గుర్తించారు. కమలమ్మ చెవులకు ఉన్న అర తులం బంగారు కమ్మలు, ఆమె వద్ద ఉన్న రూ.10 వేల నగదును గమనించిన ప్రకాష్.. వాటి కోసం హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆమెను హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో పెట్టి నీటి సంపులో పడేసినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం.

**సీసీ ఫుటేజీతో చిక్కిన నిందితుడు**

కమలమ్మ అదృశ్యంపై కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. కమలమ్మను షాప్‌లోకి తీసుకెళ్లిన నిందితుడి కదలికలు పోలీసులకు కీలక ఆధారాలుగా మారాయి. వాటి ఆధారంగా ప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అర తులం బంగారం, రూ.10 వేల కోసం వృద్ధురాలి ప్రాణాలు తీయడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మనవరాళ్లకు ఆధారంగా నిలిచిన కమలమ్మను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై పోలీసులు మరింత దర్యాప్తు చేస్తున్నారు.

## సూరజ్ నగర్ -3కాలనీ నూతన కమిటీ ఎన్నిక



తుర్కయంజాల్:/నేటి దిక్సూచి :ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని సూరజ్ నగర్- 3 కాలనీ నూతన కమిటీని కాలనీ వాసులు రొక్కం సంజీవ రెడ్డి, జి. వై శ్రీనివాస్ గౌడ్, వై . భూపతి రెడ్డి, ఎన్ . మల్లేష్ యాదవ్, జంపుల శ్రీనివాసులు, కె . రమేష్ యాదవ్, కె . జగత్ రాజుల ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ నూతన అధ్యక్షుడిగా తెలగమల్ల క్రిష్ణ, ఉపాధ్యక్షులుగా గుండాల రమేష్ గౌడ్, డి . నర్సింహా, సెక్రటరీగా యూ . రాజశేఖర్ యాదవ్, జాయింట్ సెక్రటరీగా సిహెచ్ . జగన్, ట్రెజరర్‌గా పి . రామ కృష్ణ ఎన్నికయ్యారు.

# టీపీవో సస్పెండ్!

### అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరి మృతి

మాదాపూర్:నేటి దిక్సూచి :అనుమతులు లేకుండా సాగుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవడంలో విఫలమైన మాదాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్ (టీపీవో) యు. సంతోష్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటనను తీవ్రంగా పరిగణించిన సీఎంసీ కమిషనర్ సృజన ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భవనం కూలిపోవడంతో పక్కనే ఉన్న మరో భవనం కూడా దెబ్బతింది. ఈ ఘటనతో ప్రజల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా అనధికార నిర్మాణాన్ని నిలువరించడంలో టీపీవో విఫలమయ్యారని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**ముందే నోటీసులు.. అయినా ఆగని నిర్మాణం**

టౌన్ ప్లానింగ్ విభాగం నివేదిక ప్రకారం ఫరీన్ సిద్ధిఖ్, ఎండీ సాజిద్ పేర్లతో భవన నిర్మాణ అనుమతులు పొందకుండానే పనులు చేపట్టినట్లు గుర్తించారు. నిబంధనలకు అనుగుణంగా నిర్దేశిత సెట్‌బ్యాక్‌లు కూడా పాటించలేదని నివేదికలో పేర్కొన్నారు. ఈ అక్రమ నిర్మాణంపై 2026 జూన్ 17న టౌన్ ప్లానింగ్ విభాగం నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణాన్ని పూర్తిగా నిలువరించడంలో సంబంధిత అధికారి విఫలమయ్యారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

**ప్రాణనష్టానికి అధికారుల వైఫల్యమే కారణమా?**

అనధికార నిర్మాణంపై సకాలంలో కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయని అధికారులు పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న రికార్డులు, ఘటనకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించిన అనంతరం టీపీవోపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని ఆదేశించారు.